


అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 254 గురువారం 01 జనవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-
Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts

## న్యూ ఇయర్ జోష్

### నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం
### మ్యూజిక్‌తో హెూరెత్తిన హెూటళ్లు



**విశాఖపట్నం,డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
న్యూ ఇయర్ వేడుకలను బుధవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. ఈ ఈవెంట్ కోసం అన్ని హెూటళ్లు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. రాత్రి ఎనిమిది గంటల నుంచే డీజే మ్యూజిక్, పసందైన వంటకాలతో ఆహుతులను అలరించాయి. నోవాటెల్ హెూటల్‌లో మాఫియా థీమ్‌తో ఒక పార్టీ, జంగిల్ పేరుతో మరో పార్టీ నిర్వహించారు. ది పార్క్ హెూటల్‌లో కాస్మిక్ రోబోతే డీజే వాయించారు. ఫ్యాషన్ షో నిర్వహించారు. గ్రహాంతర వాసుల వేషాలతో డ్యాన్సులు చేశారు. లాసన్స్ బే కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో ప్రత్యేక సంగీత కార్యక్రమం ఏర్పాటుచేశారు. మిగతా 2లో...

## గిగ్ వర్కర్ల సమ్మె విజయవంతం

### దిగొచ్చిన ఫుడ్ యాప్‌లు
### డెలివరీ బాయ్స్‌కు ప్రోత్సాహకాలు పెంపు



## భారత్ అమ్ములపొదిలో మరో అస్త్రం ప్రళయ్



**ఒకే లాంచర్ నుంచి రెండు 'ప్రళయ్' క్షిపణులు..**
**. ప్రయోగం విజయవంతం**
**వరుసగా రెండు మిసైల్స్ పరీక్ష విజయవంతం**
**150 నుంచి 500 కిలోమీటర్ల లక్ష్యాలను ఛేదించే సత్తా**
**డీఆర్డీవో శాస్త్రవేత్తలను అభినందించిన రాజ్‌నాథ్ సింగ్**
**త్వరలోనే సైన్యంలో చేరనున్న ప్రళయ్ క్షిపణులు**

ఒడిశా **డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
భారత రక్షణ రంగం మరో కీలక మైలురాయిని చేరుకుంది. బుధవారం ఒడిశా తీరంలో ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'ప్రళయ్'ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఒకే లాంచర్ నుంచి రెండు క్షిపణులను స్వల్ప వ్యవధిలో ప్రయోగించి వాటి సామర్థ్యాన్ని విజయవంతంగా పరిశీలించారు. యూజర్ ఎవాల్యుయేషన్ ట్రయల్స్‌లో భాగంగా ఈ పరీక్షలు నిర్వహించినట్లు రక్షణ శాఖ వెల్లడించింది.బుధవారం ఉదయం 10:30 గంటల సమయంలో రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ మిగతా 2లో...

# 6 వరకు అసెంబ్లీ

### నేడు కృష్ణా, గోదావరిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
### 2న ఉపాధి హామీపై సభలో లఘు చర్చ

**హైదరాబాద్‌డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
అసెంబ్లీ సమావేశాలు జనవరి 6 వరకు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఈ అంశంపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో స్పష్టత రాలేదు. బీఏసీ సమావేశం అనంతరం బిజినెస్‌కు సంబంధించి స్పష్టమైన ప్రకటన చేస్తారు. అందుకు భిన్నంగా ఈసారి ఎలాంటి అధికార ప్రకటన చేయలేదు. దాంతో ఎన్ని రోజులు నిర్వహిస్తారనే అంశంపై సర్కార్ తీసుకునే నిర్ణయమే ఫైనల్ కానుంది. అధికారులు చెబుతున్న సమాచారం ప్రకారం జనవరి 6 లేదా 7 వరకు సమావేశాలు నడపనున్నట్టు తెలుస్తోంది. జనవరి 2న ఉపాది హామీపై సభలో లఘు చర్చ జరగనుంది. మహాత్మాగాంధీ ఉపాధి హామీ స్థానంలో కొత్తగా తీసుకొచ్చిన వీబీ జీ రామ్ జీ స్కీం వల్ల తెలంగాణ ఏటా రూ.1,200 కోట్లు నష్టపోనుంది. అలాగే కార్మికుల పనిదినాలు, వేతనాలు, ఇతర అంశాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. మిగతా 2లో...



## గిరిజన మహిళలకు ఉప ముఖ్యమంత్రి నూతన సంవత్సర కానుక



### సికిల్ సెల్ ఎనేమియా బాధితుల కోసం అరకులో బ్లడ్ బ్యాంకు

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో**
**దాతల సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రికి అనుబంధంగా బ్లడ్ బ్యాంక్ భవనం నిర్మాణం**
**వైద్య నిపుణుల సూచనలతో బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు సన్నద్ధం**

అమరావతి,**డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
గిరిజన మహిళల్లో గర్భస్రావాలు, రక్తహీనత తదితర రుగ్మతలకు కారణమవుతున్న సికిల్ సెల్ ఎనేమియా నుంచి రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో అరకు నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో బ్లడ్ బ్యాంక్ భవనం ఏర్పాటు కానుందిమిగతా 2లో...

## ఉద్యోగుల పెండింగ్ బిల్లులు రూ.713 కోట్లు విడుదల

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్‌డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల్లో డిసెంబర్‌కు సంబంధించిన రూ.713 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు బుధవారం డిసెంబర్ నెలకు చెందిన రూ.713 కోట్ల బిల్లులను విడుదల చేశారు. ప్రతినెలా రూ.700 కోట్ల చొప్పున పెండింగ్ బిల్లులను విడుదల చేస్తామంటూ ఉద్యోగ సంఘాలకు ప్రజా ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. జూన్ నెలాఖరులో రూ.183 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ తర్వాత ఆగస్టు నుంచి ప్రతినెలా కనీసం రూ.700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వచ్చింది. ఉద్యోగుల గ్రాట్యూటీ, జీపీఎఫ్, సరెండర్ లీవులు, అడ్వాన్సులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం విడుదల చేసింది. డిసెంబర్‌కు సంబంధించి రూ.713 కోట్ల పెండింగ్ బిల్లులు విడుదల చేయడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మిగతా 2లో...



## ఆలయాల్లో అపచారాలు జరిగితే ఉపేక్షించడం

### వరుస ఘటనలపై మంత్రి ఆనం హెచ్చరిక



నెల్లూరు,**డిసెంబర్31:** :ఆలయాల్లో తప్పులు,అపచారాలు జరిగితే ఉపేక్షించబోమని, ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి హెచ్చరించారు. ద్రాక్షారామం, సింహాచలం, నంద్యాల ఘటనలపై ఆత్మకూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఘటనలపై వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టామని, పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు
భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలనిమిగతా 2లో...

## ఏపీలో పింఛన్ల పండగ..

**శ్రీకాకుళంలో 9 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల బకాయిలు అందజేత**
**నూతన సంవత్సరం సందరరేగా ఒక రోజు ముందుగానే పింఛన్ల పంపిణీ**
**రాష్ట్రవ్యాప్తంగా 63.12 లక్షల మందికి రూ.2,743 కోట్లు విడుదల**
**శ్రీకాకుళం జిల్లాలో 9 మందికి రూ.18 లక్షల బకాయిలు అందజేసిన మంత్రి అచ్చెన్న**



## గోదావరి నీటి మళ్లింపును అంగీకరించం

**-ఏపీ ప్రతిపాదనలను అడ్డుకుంటా**
**ంకేంద్రంపై ఒత్తిడితో పాటు న్యాయ పోరాటం చేస్తాం**
**: నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**



**హైదరాబాద్‌డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
గోదావరి నీటిని ఆంధ్రప్రదేశ్ ఏ రూపంలో మళ్లించినా అంగీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారమొక ప్రకటనలో పేర్కొన్నారు. గోదావరి ట్రిబ్యూనల్ 80 టీఎంసీలకు అనుమతిం చిందనీ, అంతకంటే ఒక్క చుక్కనీరు ఎక్కువ తీసుకెళ్లినా ఉపేక్షించబోమని తెలిపారు. మిగతా 2లో...

# 6 వరకు అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)
వీబీ జీ రామ్ జీ స్కీంను రద్దు చేసి పాత చట్టానే కొనసాగించాలని అసెబ్లీలో తీర్మానం చేయనున్నట్టు సమాచారం. ఈ అంశంపై బీజేపీ మినహా అన్ని పార్టీల సభ్యులు అంగీకారం తెల్పే అవకాశం ఉంది. జనవరి 4న ఆదివారం కావడంతో సభ జరిగే అవకాశాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో 3న గోదావరి, 5న కృష్ణా జలాలపై సభలో చర్చ జరిగే అవకాశం ఉంది. తెలంగాణ నీటి వాటాల విషయంలో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్న క్రమంలో ఏర్పాటు చేసిన శాసనసభా సమావేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పాలమూరు-రంగారెడ్డి, పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్ట్‌లపై క్యూసెక్కులు, టీఎంసీలు, అంకెలు, సంఖ్యలతో రెండు పార్టీలు అసెంబ్లీ వేదికగా నీళ్ల యుద్ధానికి సిద్ధమవుతున్నాయి. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నేడు ప్రజాభవన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

## ఆలయాల్లో అపచారాలు జరిగితే ఉపేక్షించడం

(మొదటి పేజీ తరువాయి)
ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామం భీమేశ్వర ఆలయం వెలుపుల శివలింగాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. ఆలయ సిబ్బందిపై కక్షతో అర్ధరాత్రి వేళ నిందితుడు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు తేలింది. దేవాదాయ శాఖ అధికారులు వెంటనే ఆలయంలో నూతన శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. నంద్యాలలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వెండి వస్తువుల స్థానంలో నకిలీ వస్తువులు పెట్టిన విషయమై కర్నూలు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌ను విచారణాధికారిగా నియమించాం. వెండి ఆభరణాలు తిరిగి స్వామివారికి చేరే వరకు తప్పు చేసినవారిని వదిలిపెట్టమని హెచ్చరించారు. సింహాచలం అప్పన్న ప్రసాదంలో పురుగు రావడాన్ని గుర్తించి తెలిపిన భక్తుడితో దురుసుగా ప్రవర్తించిన ఆలయ ప్రసాదం కౌంటర్ ఉద్యోగిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈవోను ఆదేశించామని అన్నారు. ఇప్పటికే ఎఫ్ఐఆర్‌ను నమోదు అయింది. ఆలయాల పరిరక్షణ, సామాన్య భక్తుల భద్రత కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యం. గతంలో ఎన్నడూ లేని విధంగా ముక్కోటి ఏకాదశి రోజున దేవాలయాలకు భక్తులు భారీగా తరలి వచ్చారని అని మంత్రి తెలిపారు.

## భారత్ అమ్ములపొదిలో మరో అస్త్రం ప్రళయ్

(మొదటి పేజీ తరువాయి)
ఆధ్వర్యంలో ఈ ప్రయోగం జరిగింది. ప్రయోగించిన రెండు క్షిపణులు నిర్దేశిత మార్గంలో ప్రయాణించి, లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించాయని అధికారులు తెలిపారు. చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో మోహరించిన ట్రాకింగ్ సెన్సార్ల ద్వారా క్షిపణి పనితీరును ధృవీకరించుకున్నారు. డీఆర్డీవో సీనియర్ శాస్త్రవేత్తలు, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ ఉన్నతాధికారులు ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. 'ప్రళయ్' క్షిపణి 150 నుంచి 500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు. ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన సాలిడ్ ప్రొపెల్లెంట్ క్వాసీ-బాలిస్టిక్ మిసైల్. అత్యాధునిక నావిగేషన్, గైడెన్స్ వ్యవస్థలతో పనిచేసే ఈ క్షిపణి.. వివిధ రకాల వార్‌హెడ్‌లను మోసుకెళ్తూ శత్రువుల స్థావరాలపై విరుచుకుపడగలదు. హైదరాబాద్‌లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (=జ×)తో పాటు పలు డీఆర్డీవో ల్యాబ్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (దీణా) వంటి సంస్థల సహకారంతో దీనిని అభివృద్ధి చేశారు. ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. సాల్వో లాంచ్ విజయవంతం కావడంతో క్షిపణి విశ్వసనీయత నిరూపితమైందని ఆయన పేర్కొన్నారు. ఈ విజయంపై డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ మాట్లాడుతూ.. త్వరలోనే ఈ క్షిపణి వ్యవస్థను సైన్యంలోకి ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశలో ఉన్నాయని తెలిపారు.

## న్యూ ఇయర్ జోష్

(మొదటి పేజీ తరువాయి)
దీనికి 'పాడుతా తీయగా...' విజేత సార్థక్, జీ సరిగమప, మా సూపర్ సింగర్ ఫైనలిస్ట్ సింగర్ అమితలతో డీజే సన్నీ హాజరయ్యారు. ఇంకా గ్రీన్ పార్క్, డాలిాన్, వెస్ట్ బెస్టర్న్, ఫోర్ పాయింట్స్, ఎలిగెంట్ హోటళ్లలో గాలా డిన్నర్‌లు ఏర్పాటుచేశారు. బీచ్‌రోడ్డు సందర్శకులతో కిటకిటలాడింది. సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్, మద్దిలపాలెంలో దేవి హోమ్స్, ఎండాడలో వైశాఖి స్కైలైన్, పీఎం పాలెం ఎంవీవీ సిటీలోని గేటెడ్ కమ్యూనిటీల్లోను న్యూ ఇయర్ వేడుకలు భారీగా నిర్వహించారు. పిల్లలకు పోటీలు నిర్వహించి, యువజంటలతో డ్యాన్స్‌లు చేయించారు. అపార్టుమెంట్లలో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**కేకులు, బొకేలకు భలే డిమాండ్**

న్యూ ఇయర్ సందర్భంగా నగరంలో వివిధ రకాల కేకులు, పూల బొకేలకు డిమాండ్ ఏర్పడింది. గత ఏడాదితో పోలిస్తే కేకుల అమ్మకాలు 25 శాతం మేర పెరిగాయని బేకరీ యజమానులు తెలిపారు. కూల్ కేకులపై అధికశాతం మంది ఆసక్తి చూపారన్నారు. మొత్తంగా 100 నుంచి 150 టన్నుల కేకులను విక్రయించామన్నారు. దీంతో సుమారు రూ.7 కోట్ల వ్యాపారం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. ఇక పూల బొకేల ధరలు గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరిగాయి. అయినప్పటికీ విక్రయాలు తగ్గలేదు. కనీసం పది శాతం మేర పెరిగాయి. సాధారణ బొకే రూ.500 నుంచి రూ.750 వరకు ధర పలకగా, కడియం నర్సరీ నుంచి తెప్పించిన ప్రత్యేక పూలతో రూపొందించిన బొకేలు రూ.1,500 నుంచి రూ.3 వేల వరకు విక్రయించారు. వీటితో పాటు డ్రైఫ్రూట్స్, ఫ్రూట్ బాస్కెట్స్, స్వీట్ బాక్సులకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. గిఫ్టబాక్సుల రూపంలో విక్రయానికి సిద్ధం చేసిన వీటి ధరలు రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు పలికాయి.

## రాష్ట్రంలో 3 మున్సిపాల్టీల గ్రేడ్‌ల పెంపు

### జాబితాలో కదిరి,తణుకు, కొవ్వూరు

**అమరావతి,డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):)** రాష్ట్రంలో 3 మున్సిపాల్టీల గ్రేడ్ పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శ్రీసత్యసాయి జిల్లాలోని కదిరి మున్సిపాలిటీ హోదా పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చింది. స్పెషల్ గ్రేడ్‌లో ఉన్న కదిరి మున్సిపాలిటీ హోదాను సెలక్షన్ గ్రేడ్‌కు పెంచారు. గడచిన రెండేళ్లలో మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలను పరిగణనలోకి తీసుకుని హోదా పెంచారు. గ్రేడ్-1లో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మున్సిపాలిటీ హోదాను సెలక్షన్ గ్రేడ్ కు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. 2022 నుంచి మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలు సంతృప్తికరంగా ఉండటంతో హోదా పెంచాలని నిర్ణయించి నోటిఫికేషన్ జారీ చేసింది. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మున్సిపాలిటీ హోదా గ్రేడ్ 3 నుంచి గ్రేడ్-1కు పెంచుతూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మున్సిపాలిటీకి 2021 నుంచి వచ్చిన ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని హోదా పెంపు నిర్ణయం తీసుకున్నారు. హోదాల పెంపు ఇవాళ్టి నుంచే అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి నూతన సంవత్సరం శుభాకాంక్షలు



హైదరాబాద్ **డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047 లక్ష్యసాధన దిశగా 2026లో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులతో పాటు మహిళలు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని గుర్తు చేశారు. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలనీ, ప్రజలందరూ ఆనందంతో, ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు.

# గోదావరి నీటి మళ్లింపును అంగీకరించం

(మొదటి పేజీ తరువాయి)
తమ ప్రభుత్వం అడ్డుకోవడం వల్లే గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఏపీ ఉపసంహ రించుకుందని వివరించారు. దాని స్థానంలో గోదావరి-నల్లమలసాగర్ ప్రాజెక్ట్‌ను ప్రతిపాదించిందని తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), గోదావరి వాటర్ డిస్ట్రిబ్యూట్ ట్రిబ్యూనల్ (జీడబ్ల్యూడీటీ), పునర్విభజన చట్టానికి వ్యతిరేకంగా ఏపీ తీసుకున్న నిర్ణయాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఒక వైపు కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాశయాల్లో 200 టీఎంసీల నీటిని మళ్లించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నికర జలాలు కాకుండా అదనపు జలాలపై ఆధారపడి ప్రాజెక్ట్ చేపట్టడం సరికాదన్నారు. వరద రాని సీజన్‌లో నికర జలాలను మళ్లిస్తారనీ, ఫలితంగా తెలంగాణకు తీవ్ర అన్యాయం జరగుతుందని తెలిపారు. అదనపు వాటా తరలింపును ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఏపీ తీసుకుంటున్న ప్రణాళికలు వెలుగులోకి రాగానే తక్షణమే స్పందించి జనవరి 22న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు, జూన్ 13, 16 తేదీల్లో జలశక్తితో పాటు పర్యావరణ, అటవీ శాఖలకు లేఖలు రాశామని గుర్తు చేశారు. అంతర్‌రాష్ట్ర వివాదాలు పరిష్కారం కాలేదనీ, గోదావరి నది యాజమాన్య బోర్డు నిబంధనలకు విరుద్ధమనీ, వరద నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ అనుమతి అవసరమని పేర్కొన్నారు. అయినా ఆంధ్రప్రదేశ్ గతేడాది నవంబర్ 21న డీపీఆర్ టెండర్లను పిలవడంతో, తెలంగాణ ప్రభుత్వం డిసెంబర్ 16, 2025న సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ నెం.1258/2025 దాఖలు చేసిందని తెలిపారు. గోదావరిలో తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీల నీటి హక్కులను కాపాడుకోవడమే మా ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. తాము నిర్లక్ష్యం చేస్తున్నామని ప్రతిపక్షాలు చెప్పడం అసత్యమని తెలిపారు. తెలంగాణా నీటి వాటాల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తేల్చి చెప్పారు

## గిరిజన మహిళలకు ఉప ముఖ్యమంత్రి నూతన సంవత్సర కానుక

.(మొదటి పేజీ తరువాయి)
గిరిజన మహిళలకు నూతన సంవత్సర కానుకగా నిర్మించనున్న ఈ బ్లడ్ బ్యాంకు భవనంలో అవసరాలకి అనుగుణంగా రక్తం నిల్వ చేసుకునేందుకు వీలుగా అత్యాధునిక సౌకర్యాలు కల్పించనున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో.. దాతల సహకారంతో నిర్మించనున్న ఈ భవనాన్ని నిర్మాణం అనంతరం అరకు ప్రభుత్వ ఆసుపత్రికి అనుసంధానిస్తారు. అడవితల్లి బాట కార్యక్రమం ప్రారంభోత్సవానికి వెళ్లిన సందర్భంలో కురిడీ గ్రామంలో నిర్వహించిన మాటా మంతి కార్యక్రమంలో ఓ మహిళ సికిల్ సెల్ ఎనేమియా కారణంగా గిరిజన మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి ద ృష్టికి తీసుకువచ్చారు. జన్యుపరంగా వచ్చే ఈ రుగ్మత గిరిజనుల ఉసురు తీస్తోందని వివరించారు. ఈ సమస్యకు పరిష్కారం చూపుతానని ఆనాడు మాటిచ్చారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న శ్రీ పవన్ కళ్యాణ్ గారు... సికిల్ సెల్ ఎనేమియా నివారణ ఎలా? అనే అంశంపై వైద్య నిపుణులతో పలు సందర్భాల్లో చర్చించారు. వారసత్వంగా వచ్చే ఈ వ్యాధి తీవ్రత రక్తమార్పిడి ద్వారా తగ్గించే అవకాశం ఉందన్న వారి సూచన మేరకు - నూతన సంవత్సర కానుకగా బ్లడ్ బ్యాంకు భవన నిర్మాణం చేపట్టాలని నిర?యించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 1,500 మంది సికిల్ సెల్ ఎనేమియా బాధితులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి నిర?యం ఉపశమనాన్ని ఇవ్వనుంది.

# ఏపీలో పింఛన్ల పండగ..

**శ్రీకాకుళంలో 9 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల బకాయిలు అందజేత**

**నూతన సంవత్సరం సందర్భంగా ఒక రోజు ముందుగానే పింఛన్ల పంపిణీ**

**రాష్ట్రవ్యాప్తంగా 63.12 లక్షల మందికి రూ.2,743 కోట్లు విడుదల**

**శ్రీకాకుళం జిల్లాలో 9 మందికి రూ.18 లక్షల బకాయిలు అందజేసిన మంత్రి అచ్చెన్న**

**పింఛనుదారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు**




**డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
ఏపీలో నూతన సంవత్సర కానుకగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఇవాళ పండుగ వాతావరణంలో జరిగింది. సాధారణంగా ప్రతినెలా ఒకటో తేదీన జరిగే ఈ కార్యక్రమం.. రేపు (జనవరి 1వ తేదీ) సెలవు దినం కావడంతో ఒక రోజు ముందుగానే నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం నుంచే వాలంటీర్లు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నగదు పంపిణీ చేయగా, మధ్యాహ్నం 12 గంటల సమయానికి రికార్డు స్థాయిలో 87 శాతం పంపిణీ పూర్తయింది. ఈ నెలలో మొత్తం 63.12 లక్షల మంది లబ్ధిదారుల కోసం ప్రభుత్వం రూ.2,743 కోట్లు విడుదల చేసింది.
శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా నందిగం మండలం దీనబంధుపురంలో గతంలో పింఛన్లు నిలిచిపోయిన 9 మందికి కోర్టు ఆదేశాల మేరకు బకాయిలతో సహా పింఛన్లను పునరుద్ధరించారు. నిలిపివేసిన రోజు నుంచి ఇప్పటివరకూ లెక్కించిన మొత్తం రూ.18 లక్షలను మంత్రి అచ్చెన్నాయుడు స్వయంగా ఆ 9 మంది లబ్ధిదారులకు అందజేయడం విశేషం.
పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబుమరోవైపు ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులకు సీఎం చంద్రబాబు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు పింఛన్ల కోసమే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని ఎక్స్ వేదికగా వెల్లడించారు. పేదల జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించే ఈ కార్యక్రమం తనకు ఎంతో సంత ృప్తిని ఇస్తుందని, కొత్త ఏడాదిలో అందరికీ మంచి జరగాలని సీఎం ఆకాంక్షించారు.

## గిగ్ వర్కర్ల సమ్మె విజయవంతం

### దిగొచ్చిన ఫుడ్ యాప్‌లు

### డెలివరీ బాయ్స్‌కు ప్రోత్సాహకాలు పెంపు

న్యూఢిల్లీ **డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
గిగ్ వర్కర్స్ ఇచ్చిన సమ్మె పిలుపునకు ఫుడ్ యాప్ యాజమాన్యాలు దెబ్బకు దిగివచ్చాయి. డెలివరీ బాయ్స్ డిమాండ్‌లకు తలొగ్గి పలు ప్రోత్సాహకాలు అందించడానికి ముందుకు వచ్చాయి. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బెస్ట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్‌లు సమ్మెకు పిలుపునిచ్చాయి. దీంతో ముందు జాగ్రత్తగా వ్యాపారంనష్టపోతామనే భయంతో ఫుడ్ యాప్‌లు పలు ప్రోత్సాహకాలను ప్రకటించాయి. ఈ ప్రభావంతో పలు చోట్ల సమ్మె మిశ్రమంగా జరిగింది. ఏడాది చివరి రోజు ఆటంకం కలగకూడదన్న ఉద్దేశ్యంతో ఫుడ్ డెలవరీ సంస్థలు స్విగ్గీ, జొమాటో, జెప్టో తదితర సంస్థలు పలు ప్రోత్సాహకాలను ప్రకటించాయి. డిసెంబర్ 31న సాయంత్రం ఆరు గంటల నుంచి 12 గంటల మధ్య పనిచేసే గిగ్‌వర్కర్లకు ఒక్కో ఆర్డర్‌కు రూ.120-రూ.150 చెల్లిస్తామని జొమాటో ప్రకటించింది. ఆర్డర్లను బట్టి ఒక్కొక్కరు సగటున రూ.3వేలు ఆర్జించవచ్చని పేర్కొంది. అదే విధంగా కాన్సిలేషన్లు, ఆర్డర్లు తీసుకోకపోవడం వంటి వాటిపై జరిమానాలు కూడా విధించబోమని హామీ ఇచ్చింది. జొమాటో తరహాలోనే స్విగ్గీ కూడా తన డెలివరీ బార్సుకు ఆఫర్స్‌ను ప్రకటించింది. పీక్ అవర్స్‌లో రూ.2వేల వరకు సంపాదించుకోవచ్చని పేర్కొంది. క్విక్ కామర్స్ వేదిక జెప్టో కూడా ప్రోత్సా హకాలు ప్రకటించింది. దేశ వ్యాప్తంగా డిసెంబర్ 25న గిగ్‌వర్కర్లు సమ్మె చేపట్టి ఫుడ్ యాప్‌లకు ఝలక్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో డెలివరీ యాప్స్‌పై తీవ్ర ప్రభావం పడ్డాయి. కొత్త సంవత్సరం ముందు రోజు భారీగా ఆర్డర్లు ఉండ టంతో మళ్లీ ప్రభావం పడొచ్చనే భయంతో ఆయా యాజమాన్యాలు గిగ్‌వర్కర్లకు ప్రోత్సాహకాలు పెంచి తాత్కాలికంగా బయటపడ్డాయని తెలుస్తోంది.




దేవుని ఆశీర్వాదంతో.. మనిషిగా పుట్టింది మొదలు సంవత్సరాలతరబడి వయసుపెంచి, ఆయుస్సునిస్తున్నా..కూడా లిమన మనసు, జీవనం పరిశు ద్ధంగా దేవుని లెక్కలో మారలేకుండా క్యాలెండరు లెక్కలో మారితే సున్నాప్రయోజనమే.. కావున బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులైన,నా ప్రజలందరూ మీమీ మనస్సులను దైవ చిత్తానుసారముగా మార్చుకొని నూతనపర్చబడి 2026వ నూతన సంవత్సరంలోకి ప్రవేశించి . ప్రసాద్ బాబు.మంచి ఆయురారోగ్యాలు,సుఖ సంతోషానందాలకాంతులతో సమాజంలో గొప్ప ఆదర్శంగా విలసిల్లాలని మనస్ఫూర్తిగా భగవంతుణ్ణి వేడుకొంటూ..

**నూతన సంవత్సర శుభాకాంక్షలు**
**మీ...జర్నలిస్ వార్త ప్రసాద్ బాబు**

## సమగ్ర ఎరువుల యాజమాన్య కార్డుల ద్వారానే ఎరువుల పంపిణీ.

-మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు.



**బయ్యారం/డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం రైతులకు రైతు కార్డుల ద్వారా యూరియా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు,జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేంద్రప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ రైతులకు కావలసిన యూరియా ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతుందని రైతులు ఎవరు అధైర్య పడవద్దని పంటలకు కావలసిన సమయంలో కావలసిన ఎరువులు రైతు కార్డుల ద్వారా పంపిణి చేస్తామని తెలిపారు.రైతుల అధైర్య పడకుండా తమ పంట సాగు పనులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దారు నాగరాజు, ఎంపిడిఓ దీపిక,మండల వ్యవసాయ అధికారి కే.రాజు,ఎస్సై తిరుపతి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు ఫయాజ్,నాగరాజు, తేజస్విని,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పి ఆర్ టి యు టీఎస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ




**రాయపర్తి/డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని కొండూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 2026 పిఆర్ టి యు టీఎస్ నూతన క్యాలెండర్ ను వరంగల్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కటకం రఘు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టీఎస్ మండల అధ్యక్షులు ఆవుల రవీందర్,మండల ప్రధాన కార్యదర్శి గాదె. ప్రవీణ్ రెడ్డి, ఉపాధ్యాయులు భోజ్య నాయక్, సత్యనారాయణ, నాగరాజు, వీరస్వామి, నవీన్, రాజు, ఉషారాణి, లక్ష్మీ ప్రసన్న, శ్రీదేవి ,అయేషా సుల్తానా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## 2026 నూతన సంవత్సరం శుభాకాంక్షలు

సీనియర్ జర్నలిస్ట్కొట్టే లెనిన్ సుధాకర్



ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు,అధికారులకు, మీడియా మిత్రులకు,సహ జర్నలిస్టులకు హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు. 2026 సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లోఆరోగ్యం, ఆనందం, శాంతి,అభివృద్ధి, ప్రజాసేవా స్ఫూర్తితోమరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నాను. సత్యంన్యాయంప్రజాహితం అనే విలువలతోపత్రికారంగం మరింత బలోపేతం కావాలని,ప్రజాస్వామ్యానికి దిశానిర్దేశం చేసే శక్తిగామీ అందరి సహకారంతో కొనసాగాలని కోరుకుంటున్నాను.

**-డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**

## ఊరకుంట చెరువును సందర్శించిన ఇరిగేషన్ డిఇ సాగర్,సర్పంచ్ ప్రవీణ్ నాయక్.





**బయ్యారం/డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**బయ్యారం మండలం గంధంపల్లి, కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో గల ఊరకుంట చెరువును ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాలతో సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్,ఇరిగేషన్ డిఇ సాగర్,ఏఇఇ పృధ్వి సిబ్బందితో కలిసి ఊరకుంట చెరువు పరిసర ప్రాంతం యొక్క సరిహద్దులను పరిశీలించి ఎస్టిమేషన్ వేశారు. త్వరలోనే ప్రజలకు అందుబాటులో వచ్చే విధంగా మిని ట్యాంక్ బ్యాండ్ గా నిర్మాణ పని పూర్తి చేయాలని సర్పంచ్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు భూక్య శ్రీను,బానోత్ లింగన్న, టీడీపీ మండల అధ్యక్షుడు వడ్లమూడి కోటేశ్వరరావు, బాలకృష్ణ,సంతోష్,గ్రామపంచాయతీ సిబ్బంది సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలను ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అకస్మికంగా తనిఖీ





**బయ్యారం/డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
బయ్యారం మండలంలోని ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలను అకస్మికంగా ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ జి.దేసి రాం నాయక్ బుధవారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఇర్సులాపురం పే యూనిట్ పరిధిలోని వివిధ జీపీఎస్ పాఠశాలలను,అలాగే ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 60 డేస్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఎస్ఎస్సి విద్యార్థులతో మాట్లాడి, మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడంతో పాటు, పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా. బి. శోభన్ బాబు,డిప్యూటీ వార్డెన్ కె.లాలయ్య, హీరా సింగ్,శ్రీను వీరు, కాంతారావు,పీడీ.వాలు,తులసీ దాస్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్రస్వామి ఆలయ హుండీ రూ8.68లక్షలు





**భీమదేవరపల్లి/డిసెంబర్31 (జర్నలిస్ట్ వార్త)**
: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయ హుండీ బుధవారం లెక్కించారు. గత ఐదు నెలల 15 రోజుల హుండీ ఆదాయం నోట్లు రూ 8,04,270, నోట్లు రూ 64,472, మొత్తం రూ. 8,68,742 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇవో కిషన్ రావు తెలిపారు. అదేరోజు దేవస్థానం బ్యాంకులో జమ చేయడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ హనుమకొండ డివిజన్ పరిశీలకులు అనిల్, గ్రామ సర్పంచ్ సిద్ధమల్ల రమా రమేష్, ఉప సర్పంచ్ తాళ్లపల్లి యాదగిరి, వార్డ్ మెంబర్స్, గ్రామ ప్రముఖులు, ప్రజలు భక్తులు, శ్రీ రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహనతోనే రక్షణ సాధ్యం.

-డీఎస్పీ తిరుపతి రావు






**బయ్యారం/డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
మన అప్రమత్తతే సైబర్ నేరాల బారినపడకుండా కాపాడుతుందని మహబూబాబాద్ డిఎస్పి తిరుపతి రావు అన్నారు. సైబర్ నేరాలపై అవగాహనకు సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్యక్రమాన్ని బయ్యారం కేజీబివి పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' పేరుతో జిల్లా వ్యాప్తంగా ఈ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నమన్నారు. ఈ సందర్భంగా డిఎస్పి తిరుపతి రావు మాట్లాడుతూ.. పేద, ధనిక తేడా లేకుండా అందరూ సైబర్ నేరాలకు గురవుతున్నారని చెప్పారు. అత్యాశ వల్లే చాలా మంది నష్టపోతున్నారని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేశవ్యాప్తంగా గతేడాది సైబర్ నేరాలు పెరిగితే..తెలంగాణలో తగ్గాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ రవి కుమార్,ఎస్ఐ తిరుపతి,కేజీబివి పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్ ను సన్మానించిన ఉన్నత పాఠశాల అధ్యాపక బృందం




**స్టేషన్ ఘన్ పూర్/డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త)** :మండలంలోని తాటికొండ గ్రామ సర్పంచ్ గా నూతనం గా ఎన్నికైన సర్పంచు మారాపాక సుజనా శ్రీనివాసు దంపతులను తాటికొండ ఉన్నత పాఠశాలల ఆవరణ లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెనుమాటి వెంకటే శ్వర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బేతి మంజుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మారపాక సుజనా శ్రీనివాస్ మొదటిసారి తాటికొండ ఉన్నత పాఠశాలకు వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయులు పెనుమాటి వెంకటేశ్వర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బేతి మంజుల ఆధ్వర్యంలో స్వాగతంపలికి పాఠశాలకు ఆహ్వానించారు. నూతనం గా గెలిచిన సర్పంచ్ తాటికొండ ఉన్నత పాఠశాల అభి వృద్ధికి తోడ్పడగలరని ప్రధానోపాధ్యాయులు, చైర్మన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు రుద్ర, లింగమూర్తి, రంజిత్ కుమార్, రవీందర్, సలావుద్దీన్ పీడి గిరెడ్డి ప్రమోద్ రెడ్డి,రవి,సువర్ణ తదిత రులు పాల్గొన్నారు.

## హిస్టరీ అతిథి అధ్యాపక నియమం కొరకు దరఖాస్తులు చేసుకోవాలి



**స్టేషన్ ఘన్ పూర్/డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త) :**
స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ అతిథి అధ్యాపక నియమం కొరకు దరఖాస్తులు చేసు కోవాలని స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ) లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి చంద్రమౌళి తెలిపారు. ఈసందర్భంగా కళాశాలప్రిన్సిపల్ (ఎఫ్ఏసీ) లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి చంద్రమౌళి మాట్లాడుతూస్టేషన్ ఘనపూర్ ప్రభుత్వడిగ్రీ కళాశాల,జనగాంనందు హిస్టరీ సబ్జెక్టులో అతిథి ఆధ్యాపక నియామము కొరకు దరఖాస్తులనుఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిస్టరీ సబ్జెక్టులో ఒకటి ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక నియామకం కొరకు 5 జనవరి 2026, సోమవారం స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూస్ నిర్వహించనున్నట్లు, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.నియామకం కొరకు అర్హతలు యంఏ చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ సబ్జెక్టులలో 55 శాతం మార్కులు, ఎస్సీ,ఎస్టీ లకు 50 శాతం మార్కులతో పాటు, పీహెచ్డీ డిగ్రీ,నెట్, సెట్ సర్టిఫికెట్లు కలిగి ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని,వీరు లభించనప్పుడు మాత్ర మే పోస్ట్ గ్రాడ్యుయేట్స్ మార్కుల శాతము పరిగణలో కి తీసుకొనబడునని అనుభవం, అర్హ తలను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడునని అన్నారు. ఆసక్తి గల వారు జనవరి 3 తేదీలోపు బయోడేటా అప్లికేషన్ ను స్టేషన్ ఘానపూర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఇవ్వగలరని, వీరి కి మాత్రమే ఈ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించ బడునని అన్నారు. అర్హత,ఆసక్తిగల అభ్యర్థులు ఒరిజి నల్ సర్టిఫికెట్స్ లతో ఇంటర్వ్యూకు హాజరు కాగలరని కోరారు.

## జిల్లా కలెక్టర్ ను కలిసిన సర్పంచ్ తిరుపతమ్మ

-సర్పంచ్ ను సన్మానించిన జిల్లా కలెక్టర్






**స్టేషన్ ఘన్ పూర్/డిసెంబర్ 31(జర్నలిజర్నలిస్ట్ వార్త) :**
చిల్పూర్ మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ సర్పంచ్ గా నూతనంగా ఎన్నికైన ఇల్లందుల తిరుపతమ్మ బుధవారం జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాష షేక్ (ఐఏఎస్) ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ సర్పంచ్ తిరుపతమ్మను శాలువాతో మర్యాదపూర్వకంగాసత్కరించారు. అనంతరం కలెక్టర్ ను కూడా సర్పంచ్ సత్కరించగా, ఆమెకు శుభాకాంక్ష లు తెలిపారు. అనంతరం గ్రామంలో కుక్కలు, కోతుల నివారణకు సహకరించాలని కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. కుక్కలకు సంబంధించి కుటుంబ నియం త్రణ కోసం జనగామ మున్సిపల్ పరిధిలోని ఏబీసీ సెంటర్ తరలించే విధంగా మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు .ఇందుకు సంబంధించి గ్రామంలోని కుక్కల ను పట్టుకునేందుకు మున్సిపల్ నుంచి ప్రత్యేక సిబ్బం దిని పంపిస్తామని కలెక్టర్ తెలుపడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందుల సుదర్శన్, జనగాం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతి



**రాయపర్తి/డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మైలారం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీస్ లు తెలిపిన వివరాల ప్రకారం మైలారం గ్రామానికి చెందిన గాడిపెల్లి పెంటయ్య(70)బట్టలను ఇస్త్రీ చేయించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా వరంగల్ నుండి తొర్రూరు వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా మృతి దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం వర్ధన్నపేట హాస్పిటల్ కు తరలించారు. మృతుని కుమారుడు వెంకన్న పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన సీపీఐ నాయకులు



**వర్ధన్నపేట/డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన కడమంచి స్వరూప అనారోగ్యంతో మృతిచెందడం పట్ల సీపీఐ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే సీపీఐ మండల కార్యదర్శి బొడ్డుపల్లి సాయిలు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మృతురాలి నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కౌన్సిల్ సభ్యులు ఆరేల్లి ప్రభాకర్, మండల కమిటీ సభ్యులు తాటికాయల మహేందర్, పలువురు పార్టీ నాయకులు మృతురాలి కుటుంబానికి ధైర్యం చెప్పారు. మృతురాలి కుటుంబం నిరుపేద స్థితిలో ఉండటంతో ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన ఆర్థిక సహాయం అందించాలని వారు డిమాండ్ చేశారు. ఇటువంటి దుర్ఘటనలు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా అండగా నిలవాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కడమంచి యాదగిరి, ప్రభాకర్, మహేందర్, తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# ఛత్రపతి శివాజీ విగ్రహానికి నిప్పంటించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

**- మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్**



**రాయపర్తి/డిసెంబర్31(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని బంధన్ పల్లి గ్రామంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి మంగళవారం నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులను కఠినంగా శిక్షించాలని మాజీ జెడ్పీటీసి రంగు కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన ఛత్రపతి శివాజీ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ ఒక గొప్ప భారతీయ యోధుడు, మరాఠా సామ్రాజ్య స్థాపకుడని అన్నారు. పశ్చిమ భారతదేశంలో స్వతంత్ర రాజ్య స్థాపనకై పోరాడిన యుద్ధ వ్యూహ నిపుణుడు, ఆదర్శ పాలకుడని, చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు, న్యాయ భావనతో ఎదిగిన నాయకుని విగ్రహనికి నిప్పంటించిన దుండగలను కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరే కుల భవన నిర్మాణ కమిటీ ఛైర్మెన్ కొడగాని నర్సింగ రావు, సర్పంచ్ గుగులోత్ ఆక్రి నాయక్, దీప్లా నాయక్, సంకినేని ఎల్లస్వామి, చందు సతీష్, జీవన్, ఐత రవి, అడ్డాల నాగేశ్వరావు, వాలు నాయక్, మాసంపల్లి రమేష్, కిషన్ రావు, సంపత్ రావు, కోటేశ్వరరావు, గద్దె మోహన్, రాజేందర్, అరవింద్, దేవా, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవకు గుర్తింపు

**డా. శ్రీనివాస్ సైదమ్మ దంపతులకు కోయ గిరిజనుల ఘన సన్మానం**



**భద్రాద్రి కొత్తగూడెం/డిసెంబర్ 31 (జర్నలిస్ట్ వార్త):**బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామంలోని శ్రీరాంపురం ఎస్టీ కాలనీ, మొతేపట్టి నగర్, చింతకుంట తదితర గ్రామ గిరిజన కోయ ప్రాంతాలను రత్నమ్మ స్వచ్ఛంద సేవా సొసైటీ నిర్వాహకులు డా. శ్రీనివాస్ సైదమ్మ సందర్శించారు. ఈ సందర్భంగా క్రిస్మస్, నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు ఉపదేశకులు చంద్రయ్య, లక్ష్మయ్య, సోలోమాన్ మాట్లాడుతూ వైఎస్ న్యూస్ లైవ్ టీవీ ఛానల్ చేయూతతో గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తిగా డా. శ్రీనివాస్ సైదమ్మను కొనియాడారు. గిరిజనుల సమస్యలు, బాధలు ప్రభుత్వానికి, రాజకీయ నాయకులకు చేరవేయడంలో ముందుండి న్యాయం సాధించారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోయ గిరిజనులు డా. శ్రీనివాస్ సైదమ్మ దంపతులకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి సుధాకర్, సోడే చంద్రయ్య, సోలోమాన్, లక్ష్మణ్, మధు, కిరణ్, సౌజన్య, శ్రీనివాస్, కావ్య, బీమయ్య, దివ్య, రమే, రాజా, రాము, సోని తదితరులతో పాటు మహిళలు, యువత, చిన్నారులు, స్థానిక గ్రామస్తులు, ఉపదేశకులు పాల్గొని డా. శ్రీనివాస్ సేవలను కొనియాడారు.

# రైతులకు యూరియా అందుబాటులో ఉంటుంది

**కాంగ్రెస్ పార్టీ నాయకుడు అడపా అనిల్ చౌదరి**



**తల్లాడ/డిసెంబర్31(జర్నలిస్ట్ వార్త);** తల్లాడ మండలం నూతనకల్ గ్రామ సొసైటీ జరిగిన సమావేశంలో ఏవో తాజుద్దీన్ ఏఈఓ త్రివేణి అడపా అనిల్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది తల్లాడ నూతన కల్లు సొసైటీ పరిది నందు ఉరియా కొరత లేదూని వ్యవసాయ అధికారి తాజద్దీన్. జరిగిన సమావేశం లో అడపా అనీల్ చౌదరి త్రివేణి దేవరపల్లి మధు. నూతన కల్లు గ్రామ రైతు లు తో కలిసి మాట్లాడారు అందరుకు అడ్వాన్స్ హ్యాపీ న్యూ ఇయర్ చెప్పారు

# పునరావాస కేంద్రంలో అన్నదానం



**వైరా/డిసెంబర్31(జర్నలిస్ట్ వార్త):**

వైరా వాస్తవ్యులు డాక్టర్ చెదల మోజస్ సోదరుడు ఆరణ్ గడ్డం బ్లేస్సీ, దంపతులు మధిర, మదర్ థెరిస్సా సేవాసదనంలోని మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక దివ్యాంగ పిల్లలకు ఉచిత భోజనం అందించి, వారికి ఆనందాన్ని పంచారు. ఆరణ్ బ్లేస్సీ, మోజస్ కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాబోయే నూతన సంవత్సర శుభాకాంక్షలు అందిస్తూ, పిల్లల ఆరోగ్యం, సుఖసంతోషాలు, సేవా కార్యక్రమాల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలు స్వీయాభివృద్ధికి, సామాజిక విలువలకు ప్రోత్సాహం పొందారు. కేంద్ర సిబ్బంది మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు మానసిక దివ్యాంగుల జీవితాల్లో సామాజిక సహకారం, ఉత్సాహాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.

# సర్పంచ్ ను సన్మానించి న కాంగ్రెస్ నాయకులు



**రాయపర్తి/డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని రాగన్న గూడెం గ్రామ పార్టీ అధ్యక్షుడు పులుగు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ గా ఎన్నికైన ఆకుల శోభనారాయణ ను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎంపీటీసీ,జడ్పీటిసి ఎన్నికలకు కాంగ్రెస్ కార్యకర్తకు సన్నద్ధం కావాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులందరూ సమన్వయంతో పనిచేసి, పార్టీ అభివృద్ధికి కృషి చెయ్యాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు దేశానికే ఆదర్శం అని, రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు హమ్యా నాయక్, మాజి టిపిసిసి కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, వర్ధన్నపేట ఏఎంసి వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్, నంగునూరి అశోక్, రెంటాల గోవర్ధన్ రెడ్డి, ఎసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, చిర్ర మల్లయ్య, పెండ్లి మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**జర్నలిస్టు వార్త బ్యూరో నరపోగు ప్రసాద్ బాబు**




**తల్లాడ / డిసెంబర్ 31 (జర్నలిస్ట్ వార్త):**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు, వివిధ శాఖల అధికారులకు, మీడియా మిత్రులకు జర్నలిస్టు వార్త బ్యూరో నరపోగు ప్రసాద్ బాబు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2026 నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు అందిస్తూ శుభప్రదంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని నూతన ఆశయాలు, నూతన ఉత్సాహంతో స్వాగతించి, వ్యక్తిగతంగా మరియు సామాజికంగా అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. కుటుంబ సభ్యులతో కలిసి నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా, హర్షాతిరేకంగా నిర్వహించుకోవాలని, శాంతిభద్రతలకు భంగం కలగకుండా బాధ్యతాయుతంగా వేడుకలు జరుపుకోవాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# వన సంరక్షణ సమితి తో అటవీ సంరక్షణ...

**రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**






**కల్లూరు/డిసెంబర్31(జర్నలిస్ట్ వార్త):**
వన సంరక్షణ సమితి సమావేశ మందిరాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డివన సంరక్షణ సమితి తో అటవీ సంరక్షణ, అభివృద్ధికి అటవీ శాఖ కు చక్కటి సహకారం లభిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో నిర్మించిన వన సంరక్షణ సమితి సమావేశ మందిరాన్ని మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ, వన సంరక్షణ సమితిని ప్రోత్సహిస్తే, అడవికి మంచి జరుగుతుందని అన్నారు. కనకగిరి, పులిగుండాల తదితర అటవీ ప్రాంతాల్లో 4 నుండి 5 వన సంరక్షణ సమితులు క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు ఆయన అన్నారు. ఇందులో నుండి గుర్తించిన ఒక సమితిని పైలట్ ప్రాజెక్ట్ గా తీసుకొని వారిని ఆర్థికంగా ప్రోత్సహించడానికి రూ. 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విదేశాలకు విహారాలకు కోట్లు పెట్టి వెళతారని, మన చుట్టూ విహారానికి అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయని అన్నారు. జిల్లాలో పులిగుండాల, కనకగిరి హిల్స్ సుమారు 35 వేల ఎకరాలకు ఒకే బిట్ గా అటవీ ప్రాంతం విస్తరించివుందని తెలిపారు. ఈ ప్రాంతం ఎంతో బాగుందని, విదేశాల్లో ఉన్న పర్యాటక ప్రాంతాల రేంజ్ లో వీటిని తీర్చిదిద్దే అవకాశం ఉందని అన్నారు. అడవులను రక్షించుకుంటూ, వన్యప్రాణులను కాపాడుకుంటూ, వినోదానికి, గిరిజనులకు ఉపయోగ పడి, లబ్ది కలిగే విధంగా ప్రోత్సహిస్తూ ప్రణాళిక చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి కార్యాచరణకు కావాల్సిన నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అటవీ పరిరక్షణ చాలా అవసరమని, అటవీ పరిరక్షణలో పౌరులుగా మన అందరిపై బాధ్యత ఉందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, 13 లక్షల వ్యయంతో వన సంరక్షణ సమితి సమావేశ మందిరాన్ని నిర్మించి, ప్రారంభించుకున్నామన్నారు. 35 వేల ఎకరాల అటవీ ప్రాంతాన్ని కబ్జా, ఆక్రమణ నుండి కాపాడడంలో వన సంరక్షణ సమితి పాత్ర కీలకంగా ఉందన్నారు. వన సంరక్షణ సమితి ఆర్థికాభివృద్ధి కి జిల్లా యంత్రాంగం నుండి అన్ని విధాలా సహకారం ఇస్తామన్నారు. కనకగిరి, పులిగుండాల, నీలగిరి పార్క్ లలో వారాంతం గడిపేలా అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, అడవులు, చెట్లు లేకపోతే మానవ మనుగడ లేదన్నారు. పర్యావరణ పరిరక్షణకు అడవులు ఎంతో అవసరమన్నారు. చెట్ల పెంపకం, వన సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పులిగుండాల, కనకగిరి హిల్స్ ప్రాంతాలను ప్రోత్సహించి అభివృద్ధి చేస్తే, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు ఆదాయంతో పాటు ఉపాధి లభిస్తుందని తెలిపారు. అంతకుముందు మంత్రి పులిగుండాల ఎకో టూరిజం విహారానికి రెండు వాహనాలను ప్రారంభించారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారిచే ఉచితంగా పంపిణీ జ్యూస్, సబ్బులు, విస్తరాకులు తయారీ యూనిట్లను వన సంరక్షణ సమితిలకు అందజేశారు. వన సంరక్షణ సమితి సభ్యులను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, ఎఫ్ డిఓ మంజుల, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నీరజ ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓటర్ల విభజన ప్రక్రియపై

# వరంగల్ అడిషనల్ కలెక్టర్ పరిశీలన





**వర్ధన్నపేట/డిసెంబర్31(జర్నలిస్ట్ వార్త):**వరంగల్ అడిషనల్ కలెక్టర్ జి. సంధ్యారాణి వర్ధన్నపేట మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వార్డుల వారీగా ఓటర్ల విభజన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా, అధికారులు సరైన పద్ధతిలో, పారదర్శకంగా, తప్పులేకుండా ఓటర్ల విభజన నిర్వహించాల్సిన అవసరం ఉన్నదని స్పష్టంగా అదేశించారు. ఆడిట్, వేర్‌హౌస్ లిస్టులు, దస్తావేజులు మొదలైన అన్ని డాక్యుమెంట్లను సమీక్షిస్తూ, ప్రతి వార్డులో ఓటర్ల వివరాలు సరిగ్గా ఉండేలా, ఎటువంటి లోపాలు రాకుండా చూడమని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ విజయ్ సాగర్, మున్సిపల్ కమీషనర్ ఇ. సుధీర్ కుమార్ సహా వర్ధన్నపేట మున్సిపల్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. జి. సంధ్యారాణి గారు, ఎన్నికల ఆవశ్యకతలకు తగ్గట్టు, ప్రతి దశను నియమానుసారం నిర్వర్తించాలి అని హైలైట్ చేశారు. ఈ పరిణామం వర్ధన్నపేటలో ఎన్నికల ప్రక్రియను మరింత సార్వజనీనంగా, సుస్థిరంగా చేయడానికి దోహదం చేస్తుందని అధికారులు విశ్వసిస్తున్నారు.

# నూతన సంవత్సరానికి హృదయపూర్వక ఆహ్వానం

### -కేక్ కట్ కాదు-కరుణకే కౌంట్‌డౌన్!-సంబరాలకన్నా సమాజమే ముఖ్యం.

**-భావ సందేశంతో నూతన సంవత్సర స్వాగతం-మానవతా విలువలే సమాజానికి మార్గదర్శి.**

**-ఎంజెఎఫ్ జిల్లా అధ్యక్షులు పసునూరి మురళి**

**వర్ధన్నపేట/డిసెంబర్31(జర్నలిస్ట్ వార్త):**
నూతన సంవత్సర వేడుకలు కేవలం సంబరాలకు పరిమితమవుతున్న ఈ రోజుల్లో, వర్ధన్నపేట పట్టణంలో జరిగిన ఒక కార్యక్రమం మాత్రం సమాజం ఆలోచించే దిశనే మార్చింది. కేక్ కట్‌తో పాత ఏడాదికి వీడ్కోలు పలికినా, ఆ వేడుకకు మానవతా విలువలే కేంద్రబిందువుగా నిలిచాయి. ఎంజెఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు పసునూరి మురళి నూతన సంవత్సరాన్ని ఆర్భాటంతో కాకుండా, ఆత్మపరిశీలనతో ఆహ్వానించారు. పట్టణ కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాత ఏడాదికి గుడ్‌బై చెబుతూ కేక్ కట్ చేశారు. అయితే అదే వేదికపై నుంచి 'మనిషిగా నిలబడటమే అసలైన విజయం' అనే సందేశాన్ని సమాజానికి అందించారు. గత ఏడాది ఎదురైన



కష్టనష్టాలు మనిషి విలువను మరింత లోతుగా అర్థం చేసుకునేలా చేశాయని పసునూరి మురళి పేర్కొన్నారు. నూతన సంవత్సరం కోపద్వేషాలకు తావులేని సంవత్సరంగా మారాలని, పరస్పర గౌరవం, సహకారం, ఆత్మీయ అనుబంధాలతో కూడిన సమాజమే నిజమైన అభివృద్ధికి పునాది అని ఆయన స్పష్టం చేశారు. ఆనందాన్ని మాత్రమే కాకుండా, బాధను కూడా పంచుకునే మనసు పెరిగినప్పుడే మానవత్వానికి అర్థం ఉంటుందని వ్యాఖ్యానించారు. శివస్ఫూర్తితో జీవిస్తూ మానవతనే మార్గదర్శిగా చేసుకుంటేనే సమాజంలో సార్థకమైన మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. రైతుల జీవితాలు పాడిపంటలతో కళకళలాడాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు నిలవాలని, ప్రజల జీవితాల్లో నూతన సంవత్సరం వెలుగు నింపాలని ఆకాంక్షించారు.

## మరణం నుండి తప్పించుట యెహోవా వశం...

# 2026 సంవత్సరం కు స్వాగతం







**వర్ధన్నపేట/డిసెంబర్ 31(జర్నలిస్ట్ వార్త):**మరణం నుండి తప్పించుట యెహోవా వశం మని పాస్టర్ సుమన్ అన్నారు. బుధవారం వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో ఏక్లేషియా పెంతకొస్తు చర్చి లో 2025 ముగుస్తున్న సందర్భంగా అల్ నైట్ ప్రార్థన చర్చి లో ప్రార్థనలు చేశారు. 2025సంవత్సరం లో జరిగిన వాగ్దానాలను గూర్చి సాక్ష్యాలు తెలిపారు. నూతన సంవత్సరం 2026 లోకి రాగానే రాత్రి 12గంటలకు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. 2026 సంవత్సరం కు స్వాగతం పలికారు. యేసు ప్రభు మరో నూతన సంవత్సరం అనుగ్రహం ఇచ్చినందుకు ప్రత్యేక ప్రార్థన లు చేశారు. ఈసందర్భంగా పాస్టర్ సుమన్ మాట్లాడుతూ 2025 సంవత్సరం లో ఎలాంటి అనుభవాల నుండి వెళ్ళావో దేవుడు చేసిన మేలును గుర్తు చేసుకోవాలన్నారు. దేవుడు మాట ఇస్తే కచ్చితంగా నెరవేరుస్తాడని తెలిపారు. నమ్మి విశ్వాసం తో ఇచ్చిన వాగ్దానాలను ఎత్తి పట్టి ప్రార్థన చేస్తే కచ్చితంగా నెరవేరుస్తాడని తెలిపారు. దేవుడు ప్రతి దినం ప్రతి ఆదివారం. ప్రతి నెల వాక్యం ద్వారా, ప్రకృతి ద్వారా, మనుష్యుల ద్వారా మాట్లాడుతాడని వివరించారు. ప్రతిమనిషి మరణిస్తాడని దేవున్ని నమ్ముకొని మంచి మార్గంలో నడుచుకోవాలని పరలోకం గూర్చి తెలుసుకోవాలని అన్నారు.





## కటికి మోహన్ రావు వర్ధంతి: ఘన నివాళులు



**తల్లాడ/డిసెంబర్31(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన కీర్తిశేషులు కటికి మోహన్ రావు వర్ధంతి సందర్భంగా ఆయనకు కుమారులు, మల్లారం గ్రామపంచాయతీ సర్పంచ్ కటికి కిరణ్ కుమార్, సీతారామయ్యతో పాటు కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కటికి మోహన్ రావు సేవలను స్మరించుకున్నారు. చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు ప్రదర్శించిన ఆయన, కాలేజీ స్థాయిలోనే నాయకుడిగా ఎదిగి, అనంతరం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా గుర్తింపు పొందారు. నీటి సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ, ఎన్ఎస్‌పీ కాలువల ఆధునికరణ పనులను నిస్వార్థంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసి రైతులకు విశేష సేవలు అందించారు. గ్రామాభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పలువురు నేతలు పేర్కొన్నారు. ఆయన సేవలకు గుర్తుగా వర్ధంతి వేడుకలను గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో ముత్తుట్ ఫైనాన్స్ బ్రాంచ్ ప్రారంభం

**ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ నమ్మకాన్ని కాపాడుకోవాలి**

**టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగాసీతారాములు**



**కొత్తగూడెం/డిసెంబర్31(జర్నలిస్ట్ వార్త):**కొత్తగూడెం పట్టణంలో గల పోస్ట్ ఆఫీస్ సెంటర్ నందు ముత్తూట్ మినీ ఫైనాన్సర్స్ గోల్డ్ లోన్ నూతన బ్రాంచ్ ను టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగాసీతారాములు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు . ఈ సందర్భంగా నాగాసీతారాములు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలను అందిస్తూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆయన సూచిస్తూ అనతి కాలంలోనే వ్యాపార పురోభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మైనారిటీ జిల్లా ఉపాధ్యక్షులు కరీంపాషా,ఓబీసీ జిల్లా సెక్రెటరీ బొబ్బాల.వెంకట్ యాదవ్,ప్రముఖ న్యాయవాది తెల్లబోయిన.రమేష్, వీరభద్రం,రవి,ఖమ్మం ఏరియా మేనేజర్ ఎం.సందీప్ కుమార్,కొత్తగూడెం బ్రాంచ్ మేనేజర్ ఎనుముల. సత్యనారాయణ , పాల్వంచ బ్రాంచ్ మేనేజర్ రమేష్, డి.ఉదయభాస్కర్ , ఖలీల్ , పాషా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు .

## గ్రామ పంచాయతీ అభివృద్ధికే గౌరవ వేతనం

**రంగయ్యపల్లి సర్పంచ్ మండల రజిత మహేష్**



**భీమదేవరపల్లి/డిసెంబర్31 (జర్నలిస్ట్ వార్త):** గ్రామ సర్పంచ్ గా నాకు వచ్చే గౌరవ వేతనం గ్రామ పంచాయితీకే అందిస్తానని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి సర్పంచ్ మండల రజిత మహేష్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ స్నేహ షబరీష్ ను వ్యాపారవేత్త లక్కిరెడ్డి తిరుపతిరెడ్డితో కలిసి హామీ పత్రం అందించారు. రంగయపల్లి గ్రామాన్ని ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని సర్పంచ్ మండల రజిత మహేష్ తెలిపారు ఈ మేరకు తనకు వచ్చే సర్పంచి గౌరవ వేతనాన్ని గ్రామ అభివృద్ధికి కేటాయిస్తానని తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రభుత్వపరంగా సైతం తమ గ్రామానికి సహకారాలు అందించి జిల్లాలో ఉత్తమ గ్రామంగా తీర్చిదిద్దాలని లక్కిరెడ్డి తిరుపతి రెడ్డి కలెక్టర్ ను కోరారు. గ్రామాన్ని అభివృద్ధి పరిచేందుకు సమిష్టిగా ముందుకెళ్లాలని అభివృద్ధిలో తమ సహకారం తప్పక తప్పకుండా ఉంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ కలిసిన వారిలో గ్రామ ఉప సర్పంచ్ ఎలబోయిన రజిత శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చవ్వాల బుచ్చయ్య, మాజీ ఎంపీటీసీ సట్ల రఘుపతి, జిమ్మల మల్లారెడ్డి ఉన్నారు.

## శాంతియుత వాతావరణంలో కొత్త సంవత్సరాన్ని స్వాగతించాలి..

**ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్.**

**సత్తుపల్లి/డిసెంబర్31(జర్నలిస్టు వార్త):**
2026 నూతన సంవత్సరం సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉల్లాసంగా జరుపుకోవాలని కోరారు. అదే సమయంలో డిసెంబర్ 31 రాత్రి శాంతి భద్రతలకు



ఎలాంటి విఘాతం కలగకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం రహదారులపై అల్లరి, అనవసరమైన గొడవలు శబ్ద కాలుష్యం కలిగించే కార్యకలాపాలు నిర్వహించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల భద్రతే ప్రభుత్వ లక్ష్యమని పోలీసు శాఖకు సహకరించి శాంతియుత వాతావరణంలో కొత్త సంవత్సరాన్ని స్వాగతించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలందరికీ మరోసారి హృదయపూర్వకంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.